ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.8, కనిష్ఠం 14.5



నిర్మల్

జిల్లా వార్తలు

8

శుక్రవారం 14 నవంబరు 2025



ఆవిష్కరణలకు సంబంధించిన వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీస్తాం

» జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికి తీయడానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్‌కు ఎన్‌సీసీ విద్యార్థులు బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మనిషి జీవితంలో యవ్వన దశ ఎంతో కీలకమైందని, ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు లోను కాకుండా, జీవితంలో స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడానికి కృషిచేయాలన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతీ విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడారు. వివేకానంద భారత యువతకు ప్రేరణ, ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పీఠాధిపతిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి దంపతులు

ధర్మాన్ని కాపాడాలి

» హంపి పీఠాధిపతి శ్రీవీరుపక్ష విద్యారణ్య భారతి

సారంగాపూర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు ధర్మాన్ని కాపాడాలని హంపి పీఠాధిపతి వీరుపాక్ష విద్యారణ్య భారతి భక్తులతో పేర్కొన్నారు. గురువారం మండలంలోని అడెల్లి మహాపోచమ్మ నూతన ఆలయంలో నెలకొల్పిన విగ్రహం వద్ద పూజలు చేసి వేద పండితులను ఆలయం వివరాలను అడిగి తెలుసుకున్నార. అడెల్లి మహాపోచమ్మతోపాటు సప్త మాత్రికలు నెలకొల్పడం వల్ల శక్తి సామరత్యం ఉంటుందని అన్నారు. అలాగే మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు పీఠాధిపతిని దర్శించుకున్నారు. అనంతరం మహిళలకు పీఠాధిపతి పండ్లు పంపిణీ చేశారు.

మోడల్ స్కూల్ టీచర్లకు జీతాలు ఇవ్వాలి

కుంటాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లిస్తున్నా తెలంగాణలో అమలు కావడం లేదని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఫెడరేషన్ ఎప్పుడు ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిబద్ధతో పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ సల్లా గోవర్ధన్, జిల్లా కార్యదర్శులు భూమన్న, రమేష్, షేక్‌పాజిల్ తదితరులు ఉన్నారు.

» ఇక ముమ్మరంగా ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్‌లు
» వీధి కుక్కల సంఖ్య తగ్గింపే ప్రధాన లక్ష్యం
» కు.ని ఆపరేషన్‌ల కోసం ప్రత్యేక సెంటర్‌లు
» మునిసిపాలిటీ ఆధ్వర్యంలో యాక్షన్ ప్లాన్



ఆపరేషన్ డాగ్ కంట్రోల్



నిర్మల్,నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం తీవ్ర సమస్యగా మారిన కుక్కల సంఖ్యను తగ్గించేందు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణను రూపొందించింది. ఇందులో భాగంగానే వీధి కుక్కల జనన నియంత్రణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికోసం ప్రతీ మునిసిపాలిటీ పరిధిలో కుక్కల కోసం ప్రత్యేకంగా జనాభా నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేయతలపెట్టిన ఏబీసీ సెంటర్‌ల కోసం స్థల సేకరణను కూడా పూర్తి చేశారు. నిర్మల్ మునిసిపాలిటీ పరిధిలో రూ.15లక్షలతో ఏబీసీ (కుక్కల జనాభా నియంత్రణ కేంద్రం) సెంటర్ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. వార్డుల వారిగా కుక్కలను పట్టుకొని వాటన్నింటిని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తారు. ఇక్కడి ఏబీసీ సెంటర్‌లో పశువైద్యశాఖకు సంబంధించిన వెటర్నరీ డాక్టర్ కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తారు. దీంతో పాటు ఫ్యామిలీ ప్లానింగ్ పూర్తయిన కుక్కలకు వారం రోజుల పాటు వాటి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచి ఆహారాన్ని కూడా అందించనున్నారు. ఆ తరువాత వాటిని పట్టుకొని వచ్చిన వీధిలోనే వదిలిపెడతారు. ఫ్యామిలీ ప్లానింగ్ కారణంగా వీధి సంతానం క్రమంగా తగ్గిపోవడమే కాకుండా ప్రజలకు వాటి బెడద తప్పనుందని అధికారులు పేర్కొంటున్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ పూర్తయిన కుక్కలకు ప్రత్యేక గుర్తులు కూడా పెట్టనున్నారు.

మునిసిపాలిటీల ఆధ్వర్యంలో కార్యచరణ అమలు

ఏబీసీ సెంటర్‌లను ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహించనుండగా మున్సిపాలిటీలు పర్యవేక్షించనున్నాయి. ఏజెన్సీలు వీధి కుక్కలకు జనన నియంత్రణ ఆపరేషన్లు చేయడమే కాకుండా వాటికి ఫీడింగ్, మెడిసిన్స్, రేబీస్ వ్యాక్సిన్ ఇవ్వడం, డీవార్మింగ్ లాంటి వాటిని మున్సిపాలిటీలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీని కోసం ప్రత్యేకంగా ఓ అధికారికి బాధ్యతలు అప్పగించనున్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఏజెన్సీలు తాము పట్టుకున్న చోటనే వీధి కుక్కలను వదిలేయాలన్న నిబంధనలపై సంబంధిత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా ఏదైనా వీధిలో వీధికుక్క మరణిస్తే వెంటనే వాటి కళేభరాన్ని తరలించే బాధ్యతలను కూడా ప్రైవేటు ఏజెన్సీలే చేపట్టాల్సి ఉంటుంది. ఏబీసీ సెంటర్‌ల నిర్వహణ వ్యయాన్ని మునిసిపాలిటీలు భరించనుండగా వాటి నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు అప్పజెప్పనున్నారు. నిర్మల్‌లో ఏర్పాటు చేయనున్న ఏబీసీ సెంటర్ నిర్మాణం కోసం రూ.15 లక్షలు మంజూరు, కాగా, మరో రూ.25లక్షల అవసరమవుతాయని అధికారులు పేర్కొంటున్నారు.

కుక్కలను పట్టే బాధ్యత ప్రైవేటుకు..

ఏబీసీ సెంటర్ల నిర్వహణ బాధ్యతలను మునిసిపాలిటీ వారిగా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పనున్నారు. దీనికి సంబంధించి అన్ని మునిసిపాలిటీ టెండర్ నోటిఫికేషన్‌లను కూడా జారీ చేశారు. ఒక్కో వీధి కుక్కకు రూ.1450లను మునిసిపాలిటీలు చెల్లించనున్నాయి. టెండర్ దక్కించుకున్న ఏజెన్సీలు వీధి కుక్కలను మునిసిపాలిటీ పరిధిలోని వార్డుల వారిగా పట్టుకొని వాటిని ఏబీసీ సెంటర్‌కు తరలించాల్సి ఉంటుంది. ఇక్కడి సెంటర్‌లో పశువైద్యాధికారి ఆ వీధి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్‌లు చేసి వారం రోజుల పాటు వాటిని ఇక్కడే సంరక్షిస్తారు. అవసరమైన మేరకు వాటిని ఆహారం కూడా అందిస్తారు. వారం రోజుల తర్వాత ఆ కుక్కలను తాము తీసుకువచ్చిన వార్డులోనే వదిలిపెట్టాల్సి ఉంటుంది. దశల వారిగా ఒక్కో వార్డు నుంచి మాత్రమే ఏబీసీ సెంటర్‌కు కుక్కలను తరలిస్తారు. తాము వేరే వీధులలో మరో వీధి కుక్కలను వదిలి పెట్టవద్దనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఒక వీధి వాతావరణానికి అలవాటు పడ్డ కుక్కలు మరో వీధిలో నివసించలేవు. ఒకవేళ అలా వదిలిపెడితే కుక్కల మధ్య గోడవలు జరిగి ప్రజలు మళ్లీ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. దీని కారణంగానే ఏ వీధిలో నుంచి పట్టుకొచ్చిన కుక్కను ఆ వీధిలోనే ఆ వీధిలోనే వదిలిపెట్టాలన్న నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయబోతున్నారు.

వీధి కుక్కల సమస్యకు ఇక విముక్తి..

వీధి కుక్కలన్నింటిని జనన నియంత్రణ ఆపరేషన్‌లు చేయబోతుండడంతో ప్రజలకు కుక్కల బెడద తప్పబోనుందని అంటున్నారు. ఇప్పటికే పలు పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా కుక్కలు, కొట్లాడుకోవడం అలాగే ప్రజలపై దాడులు చేస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అలాగే చాలా మంది గాయాలపాలై ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా పసి పిల్లలు, మహిళలు కుక్కల బీభత్సం కారణంగా వీధిలో తిరగలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకవైపు కోతులు, మరోవైపు కుక్కల బెడద కారణంగా జనం క్షణం ఒక యుగంగా గడుపుతున్నారు.

నేటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు ఘనంగా జరగనున్నాయని చైర్మన్ సయ్యద్ అర్జుమండ్ అలీ, కార్యదర్శి బుగ్గారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. 'పుస్తక హృదయ భావనం' అనే అంశంపై పలు కార్యక్రమాలను రూపొందించామని తెలిపారు. 'గ్రంథాలయాల విస్తరణ భవిష్యత్ బాణం' అనే సూత్రంతో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాకేంద్ర గ్రంథాలయంలో 14 నుంచి 20 నవంబరు వరకు ప్రతీరోజు పఠన ప్రోత్సాహక కార్యక్రమాలు సజావుగా సాగుతాయని గ్రంథాలయ అధికారి తెలిపారు. ఈనెల 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న వ్యాసరచన పోటీలు, 17న క్విజ్ కాంపిటేషన్ జనరల్ టాపిక్ ఉపన్యాస పోటీలు, 18న చిత్రలేఖనం పోటీలు, 19న బాలికలకు, మహిళలకు ముగ్గుల పోటీలే. 20న వారోత్సవాలు ముగింపు కార్యక్రమం, అతిథుల సందేశాలు ఉంటాయని వెల్లడించారు.

జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో


రబీంద్ర విద్యార్థుల ప్రతిభ



విద్యార్థుల ప్రతిభను తిలకిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ముథోల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు 2026లో భాగంగా జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన యువజన సాంస్కృతి పోటీల్లో ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. వాయిస్ కంట్రోల్ రోబోట్‌ను రూపొందించారు. వారి అద్భుత ప్రతిభను తిలకించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ విద్యార్థులకు ప్రశంసించినట్లు ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ తెలిపారు. విద్యార్థుల్లో దాటి ఉన్న అసామాన్య ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రబీంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ విద్యార్థులను ఎంతో అభినందించారు. విద్యార్థులలో విశేషమైన ప్రతిభ దాగి ఉందని దాన్ని బయటకు తీసినప్పుడు వారికి వారు నిరూపించుకుంటారని ఇందుకు ఉపాధ్యాయులు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి ఆటల పోటీల్లో సత్తా చాటిన జిల్లా గిరిజన విద్యార్థులు



క్రీడాకారులతో జిల్లా క్రీడల అధికారి

నిర్మల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12, 13న ఉట్నూర్‌లో నిర్వమించిన జోనల్ స్థాయి ఆటల పో టీల్లో జిల్లా తరఫున వెళ్లిన గిరిజన విద్యార్థులు పలు క్రీ డల్లో సత్తా చాటారని జిల్లా క్రీడల అధికారి భూక్యా రమేష్ తెలిపారు. వాలీబాల్ అండర్ - 14 విభాగంలో మొదటి బహుమతి. కబడ్డీ అండర్- 14 వి భాగంలో మొదటి బహుమతి. టెన్నికాయిట్ అండర్- 14, అండర్- 17లో మొదటి బహుమతి. బాలికలు కబడ్డీ అండర్- 14 విభాగంలో మొదటి బ హుమతి. వాలీబాల్ అండర్- 14 విభాగంలో రెండో బహుమతి. చెస్ అం డర్- 17 విభాగంలో మొదటి బహుమతి. క్యారమ్స్ అండర్- 17 విభాగంలో రెండో బహుమతి. అథ్లెటిక్స్ అండర్- 14, అండర్- 17 200ల మీటర్ల పరుగు పందెంలో రెండు బంగారు పతకాలు అర్చరీ, అండర్- 14, అండర్- 17 విభాగంలో రెండు బంగారు పతకాలు గెలుచుకుని జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన జిల్లా జట్టును ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గెడం నగేష్, ఖానాపూర్ శాసన సభ సభ్యులు వెడ్మ బొజ్జు, ఉట్నూర్ ఐటీడీఏ పీవో యువరాజ్, డీడీ జాదవ్ అంబాజీ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, ఏసీఎంవో శివాజీ, వివిధ డివిజన్ల నుంచి వచ్చిన ఏటీడబ్ల్యూవో, ప్రధానోపాధ్యాయులు భాస్కర్, చందన్, ప్రేమ్‌దాస్, ప్రకాష్, కృష్ణారావు, ఉత్తం దాస్‌లు, పీడీలు రాంజీ, హేమంత్ కుమార్, శ్రీనివాస్, గోపాల్, మధుసూదన్, పీఈటీలు పాల్గొన్నారు.

యాసంగిపైనే అన్నదాత ఆశ

» ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు
» గంపెడు ఆశతో రబీ పంటల వైపు
» నిర్మల్ జిల్లాలో సాగు కానున్న 2 లక్షల 90 వేల ఎకరాల రబీ పంట



మొక్కజొన్న విత్తుతున్న రైతులు

ముథోల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతులు ఇప్పుడు యాసంగి సాగుపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. అధిక వర్షాలు కురిసి పంటలు మునిగిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే రబీ పంటలతో ఆ నష్టాన్ని పూడ్చకోవాలనే సంకల్పంతో ఇప్పుడు రైతన్నలు దుక్కి దున్ని విత్తనాలు వేసేందుకు సంసిద్ధమవుతున్నారు.

రబీపై గంపెడు ఆశలు..

ఖరీఫ్‌లో నష్టపోయిన రైతన్నలకు ఈ రబీ సాగులోనైనా అధిక దిగుబడులు సాధించాలన్న గంపెడు ఆశలతో పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ తెలిపిన సమాచారం ప్రకారం ఈ ఏడాది నిర్మల్ జిల్లాలో మొత్తం 2 లక్షల 90 వేల ఎకరాలలో యాసంగి (రబీ) సాగు జరగనుంది. అందులో వరి 1 లక్ష 25 వేల ఎకరాలు, శనగ 50 వేల ఎకరాలు, మొక్కజొన్న 1 లక్ష 5 వేల ఎకరాలు, అలాగే ఇతర పంటలు 5 వేల ఎకరాలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. యాసంగి పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇప్పటికే సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు మార్కెట్‌లో ఎక్కువ సమయం ఆగకుండా త్వరగా మార్కెట్ విలువలు పొందే పంటలను ఎంచుకోవాలని కూడా సూచించారు. గత ఖరీఫ్‌లో నిర్మల్ జిల్లాలో సోయా, పత్తి పంటలు అధిక వర్షాల వలన తీవ్రంగా నష్టపోయాయి. వర్షపాతం ఎక్కువగా రావడం వల్ల పంటలు నీట మునిగి దిగుబడులు తక్కువగా రావడం, పెట్టుబడులు తిరిగి రాక రైతుల పరిస్థితి క్లిష్టమైంది. అయితే ఈసారి యాసంగి సీజన్‌లోనైనా మంచి పంటలతో అప్పులు తీర్చుకొని కుటుంబ ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించుకోవాలన్న గంపెడు ఆశతో రైతులు మళ్లీ కృషి ప్రారంభించారు.


అభివృద్ధి పనులకు రూ. 8.2 కోట్లు



మాట్లాడుతున్న భైంసా, ముథోల్ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు

భైంసా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముథోల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి పనుల కోసం గాను రూ. 8.2కోట్ల నిధులతో అభివృద్ధి పనులు మంజూరు జరిగిందని భైంసా, ముథోల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, బెజ్జంకి ముత్యంరెడ్డిలు వెల్లడించారు. గురువారం భైంసాలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో విలేకరుల మావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ముథోల్ మాజీ ఎమ్మె ల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నారాయణ్ పాటిల్ అభ్యర్ధన, విజ్ఞప్తుల మేర కు సంబంధిత అభివృద్ధి పనులు మంజూరైనట్లుగా పేర్కొన్నారు. సంబంధిత రూ. 8.2 కోట్ల నిధుల ద్వారా మహిళా సమాఖ్య సంఘ భవనాలు, పొలం భాట నిర్మాణాలు, పా ఠశాలల ప్రహరీల నిర్మాణాలు చేపట్టనున్నట్లుగా వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్ అవిరాళంగా కృషి చేస్తున్నట్లుగా తెలిపారు. విలేకరుల సమావేశంలో కుంటాల మాజీ ఎంపీపీ భోజారాం పాటిల్, ముథోల్ మండల కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వేణునగర్ గ్రామస్థులు

పెంబి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అం గన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో అంగన్‌వాడీ చి న్నారి పుష్ప ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పిల్లర్ గుంతలో పడి మృతి చెందిందని వేణునగర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని వేణునగర్ గ్రా మంలో మాట్లాడుతూ ఈ నెల 1న అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి ని ర్మాణం పిల్లర్ గుంతలో పడి మృతి చెందిందన్నారు. వేణునగర్ అంగన్‌వాడీ సెంటర్ ఇన్‌చార్జి బాధ్యతలు గ్రామానికి దగ్గర ఉన్న మం దపల్లి, పెంబి గ్రామ అంగన్‌వాడీ టీచర్‌కు ఇవ్వకుండా దూరంగా ఉన్న అంగన్‌వాడీ నాగపూర్ టీచర్‌కు బాధ్యతలు అప్పగించడం సరికాదని అనడంతో గ్రామస్థులపై కేసులు పెడుతున్నారన్నారు. వెంటనే అధికారులు స్పందించి వేణునగర్ అంగన్‌వాడీ టీచర్ నా గలక్ష్మిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

పీడీఎస్‌యూ మహాసభను జయప్రదం చేయండి


» జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల నవంబరు 20న జరగనున్న పీడీఎస్‌యూ జి ల్లా మహాసభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కేంద్రంలోని సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి గురువారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... నిర్మల్ జిల్లాలో నెలకొన్న విద్యా సమస్యలను పరిష్కరించేందుకు పీడీఎస్ యూ విద్యార్థి సంఘం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ)ను నిర్మల్ జిల్లాలో స్థాపించాల్సిన అవసరం ఉందని, అదేవిధంగా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడం అతవ్యసరమని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని వాగ్మారే మహేందర్ స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి, విద్యార్థి ఉద్యమాలను మరింత ఉత్సాహభరితంగా ముందుకు తీసుకెళ్లేందుకు జరగబోయే పీడీఎస్‌యూ 13వ జిల్లా మహా సభను విజయవంతం చేయాలని విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పవార్ కిరణ్, నాయకులు సిద్ధార్థ్, అద్విత్, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

పాత తర్లపాడ్‌లో డీపీవో ఆకస్మిక తనిఖీ



పాత తర్లపాడ్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న డీపీవో

ఖానాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు కాలనీలలో మురికి కాలువలను పరిశీలించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగకుండా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి చిక్యాల రత్నాకర్ రావు, తదితరులున్నారు.

రేపు నిర్మల్‌లో జిల్లా స్థాయి

నెట్ బాల్ జట్ల ఎంపిక

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ. రవీందర్ గౌడ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. (యూ-14, యూ-17) వయోపరిమితి గల బాల, బాలికల జట్ల ఎంపికలు నవంబరు 15న (శనివారం) నిర్మల్ ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా తమ పాఠశాల నుంచి క్రింది పత్రాలను తీసుకురావాలని వారు సూచించారు. పాఠశాల బోనఫైడ్ సర్టిఫికెట్, జనన సర్టిఫికెట్, గత సంవత్సరం మార్క్స్ మెమో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలి. వయో పరిమితులు ఇలా ఉన్నాయి. యూ-14 ఇయర్స్ (బి అండ్ జి) జనవరి 1, 2012 తరువాత జన్మించిన వారు. యూ-17 ఇయర్స్ (బీ అండ్ జీ) జనవరి 1, 2009 తరువాత జన్మించిన వారు ప్రతీ పాఠశాల నుంచి ఉత్తమ ఆటగాళ్లలో ఇద్దరు మంది బాలురు, ఇద్దరు మంది బాలికలు మొత్తం నలుగురిని పంపించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నిర్మల్ వ్యవహరిస్తుండగా, ఆర్గనైజర్ కే. అన్నపూర్ణ, పీడీ, జడ్పీహెచ్ఎస్ చించోలి(బి) ఫోన్ నెంబర్ 94405 12607ను సంప్రదించవచ్చు. ఎస్.జమున పీడీ, జడ్పీహెచ్ఎస్ జామ్-ఫోన్ నెంబర్ 81069 79197 ను సంప్రదించవచ్చు. వివరాలకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ (నిర్మల్)ను 99511 98890ను సంప్రదించాలని కోరారు. క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని అధికారులు సూచించారు.

డాక్టర్ నరసింహారెడ్డికి మార్కెట్ చైర్మన్‌ల సన్మానం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ట్రయాథ్లాన్ పోటీల్లో ఐరన్ మ్యాన్ టైటిల్ సాధించిన ప్రముఖ న్యూరో వైద్యుడు డాక్టర్ బీఎల్ నరసింహారెడ్డిని నిర్మల్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు సన్మానించారు. గురువారం ఆయనను కలిసి సన్మానించిన అనం తరం మాట్లాడుతూ ప్రపంచ స్థాయి పోటీల్లో విజేతగా నిలవడం, నిర్మల్ పేరు ప్రతిష్ఠలను నిల బెట్టారని కొనియాడారు. యువత డాక్టర్ నరసింహా రెడ్డిని ఆదర్శంగా తీసు కోవాలని సూచించారు. ఏకకాలంలో స్విమ్మింగ్, రన్నింగ్, సైక్లింగ్ పోటీల్లో విజేతగా నిలవడం సామాన్యమైన విషయం కాదన్నారు. అనంతరం నిర్మల్ లయన్స్ క్లబ్ సభ్యులు కూడా ఆయనను సన్మానించారు.



డాక్టర్ నరసింహారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రైతు ధీమాగా ఉండాలంటే బీమా అవసరం

» ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్



లక్ష్మీపూర్‌లో రైతును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

జైనథ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాతో పాటు నియోజక వర్గంలోని ఆయా గ్రామాల రైతులు ధీమాగా ఉండాలంటే పంటల బీమా అవసరం అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం జై నథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన హెడావ్‌దీపక్ అనే రైతుకు సంబంధించిన 50క్వింటాళ్ల పత్తి పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇటీవల దగ్ధం అయింది. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ లక్ష్మీపూర్ గ్రామానికి చేరుకుని రైతును పరామర్శించి భరోసా కల్పించారు. పత్తి పంట ప్రమాదాన్ని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించక అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్‌రెడ్డి, నాయకులు రాందాస్, బి.విజయ్, కట్కం రాందాస్ పాల్గొన్నారు.

రిజర్వేషన్‌లు సాధించేంత వరకు ఉద్యమాలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు సాధించేంత వరకు ఉద్యమాలు తప్పవని, న్యాయబద్ధంగా రిజర్వేషన్‌లను ప్రభుత్వాలు అందించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు అన్నారు. బీసీ ఉద్యమంలో భాగంగా గురువారం ధర్మ పోరాట దీక్షను నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామల దేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లను అసెంబ్లీ లో పాస్ చేయించి కేంద్రానికి పంపిందని, అయితే కేంద్రంపై ఒత్తిడి పెంచడంలో విఫలమయిందన్నారు. రిజర్వేషన్లకు అడ్డు పడుతున్న వారికి సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్తామన్నారు.

ఇంకుడు గుంతలతోనే జల సంరక్షణ

» బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



జల సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంకుడు గుంతలతోనే జలసంరక్షణ సాధ్యమని ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మన బడి - మన జలం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్ ముఖ్యఅతిథిగా హజరై ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజ చేశారు.అనంతరం ఏర్పాటు చెసిన సమావేశంలో అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రతీ పాఠశాల, ప్రతి ఒక పల్లేల్లో, ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మికచుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వృధా చేయకుండా భూమిలో కలవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను నివారించవచ్చన్నారు. నీటి విలువను గుర్తించిన మహనేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే ఈ మహోన్నతమైన మనబడి-మన జలం కార్యక్రమం ప్రారంబించడం జరిగిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆయన మన ప్రాంతాలలో చెరువుల పునరుద్దరణతో పాటు, ప్రతీ ఇంటికి ఇంకుడు గుం తల నిర్మాణానికి దోహదం చేశారని తెలిపారు. అనంతరం జల సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్, ఎంపీడీవో శేఖర్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడె వసంత్ రావ్, రవీందర్‌రెడ్డి, దేవెందర్‌రెడ్డి, నానక్ సింగ్, సురేందర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదకు టుంబాలకు అండగా నిలుస్తుందని బోథ్ ఎ మ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఈ పథకం కింద మంజూరైన చెక్కులను గురువారం మండల కేంద్రంలోని తన నివాసంలో లబ్దిదారులకు అందజేశారు. మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన సయ్యద్ జుహెరా బెగంకు రూ 20500, సోనాల మండలంలోని గుట్ట పక్క తాండకు చెందిన సరితకు రూ.60 వేల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతు సియం ఆర్ఎఫ్‌ద్వారా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు చేయుత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్ టౌన్: ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని 268 చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ది పొందడంలో అర్హులైన వారు మధ్య దళారులను నమ్మే అవసరం లేదన్నారు. ప్రభుత్వాలు ఏవైనా, పార్టీలు ఏవైనా అంతిమంగా ప్రజా సంక్షేమం కోసం పని చేయడమే లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చలి పంజా

(5వ పేజీ తరువాయి)

వీచే శీతల గాలులతో జిల్లాపై మరికొన్నాళ్ల పాటు చలి ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు జిల్లాలో వాతావరణం అతిశీతలంగానే ఉంటుంది. గతంలో ఫిబ్రవరి మాసంలోను 6.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన దాఖలాలు ఉన్నాయి. ఉదయం 10 గంటల వరకు చలి ప్రభావం అధికంగానే ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఆ తర్వాత పనులు ముగించుకుని సాయంత్రం 5గంటల లోపే ఇళ్లలోకి వెళ్లిపోతున్నారు.

అరకొర వసతులు..

వసతి గృహాలు, గురుకులాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు తీవ్రమైన చలితో గజగజ వణికి పోతున్నారు. అరకొర వసతులతో రాత్రంతా నిద్రలేమి రాత్రులు గడుపుతున్నారు. ఇప్పటికి పూర్తి స్థాయిలో వెచ్చని దుస్తులను సరఫరా చేయక పోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్న వెచ్చని దుప్పట్లతోనే కాలం వెల్లదీస్తున్నారు. నిద్రలేమి సమస్యతో చదువుల పై దృష్టి సారించ లేక పోతున్నారు. అలాగే అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. శీతకాల సీజన్ ప్రారంభంకాగానే వెచ్చని దుస్తులను సరఫరా చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. చాలా చోట్ల పగిలిన కిటికీలు, విరిగిన తలుపులే దర్శనమిస్తున్నాయి. చలి నుంచి కాపాడుకునేందుకు కిటికీలు, తలుపులకు గోనే సంచులు, అట్టముక్కలను అమర్చుకుంటున్నారు. వాటర్ హీటర్స్ మరమ్మత్తులకు నోచుకోక పోవడంతో మూలన పడే కనిపిస్తున్నాయి. దీంతో గత్యంతరం లేక కష్టమైన చన్నీళ్ల స్నానాలనే చేస్తున్నారు.

పంటలపై ప్రభావం..

వానకాల సీజన్ ముగిసి పోవడంతో రబీ పంటలను సాగు చేస్తున్న తీవ్రమైన చలి గాలులతో పంటలపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా పత్తి పంటను చీడపీడలు ఆశిస్తున్నాయి. కాయకుల్లు తెగులుతో పత్తి కాయలు నేలరాలుతున్నాయి. వివిధ రకాల రసాయన మందులను పిచికారి చేస్తున్న ఫలితం కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ఎదుగుదశలో ఉన్న గోదుమ, శన గ పంటలకు చలితో కొంత మేరకు మేలు జరుగుతుందని పేర్కొంటున్నారు.కూరగాయలు, ఆకు కూరలను చీడపీడలు ఆశిస్తున్నాయి. ముఖ్యంగా కందిలో కాయతొలుచు పచ్చ పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తుంది.దీంతో దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందంటున్నారు. ఎదుగుదల లేక పంటలు ఎరుపుభారీ పోయే ప్రమాదం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

చలిప్రభావం ఎక్కువగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల ని సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు చలి నుంచి కాపాడుకునేందుకు తప్పని సరిగా వెచ్చని దుస్తులను ధరించాలని చెబుతున్నారు. వాతావరణ మార్పులతో జలుబు, జ్వరం దగ్గులాంటి సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా శ్వాసకోస వ్యాధులతో జరజాగ్రత్తగా ఉండాలని వైద్యులు పేర్కొంటున్నారు. అస్థమా, అలర్జీ రోగులు చలి ప్రదేశాల్లో ఉండకూడదంటున్నారు. శ్వాసకోస వ్యాధులతో బాధపడే వారు మరి అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ



మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రటరీ సుందర్ రాఘవ్

ఉట్నూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ డిప్యూటీ సెక్రటరీ సుందర్ రాఘవ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల వసతుల గురించి మరియు రికార్డులను పరిశీలించారు. అధ్యాపకుల రికార్డులను మరియు సిలబస్‌ను అడిగి తెలుసుకుని వారికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశల ప్రిన్సిపల్ ధనరాజ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై దాడి హేయమైన చర్య

● కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

బోథ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు హేయమైన చర్య అని దీన్ని కాంగ్రెస్ ఖండిస్తుందని కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ భక్తుల రమేష్ సోనాల మండల సీనియర్ నాయకులు గాజుల పోతన్నలు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దాడుల సంస్కృతికి టీఆర్ఎస్ నా యకులు తెరలేపారని మేము గడనుక దాడులకు పాల్పడితే టీఆర్ఎస్ నాయకుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని వారు విమర్శించారు. ఏ హోదాలో మీ పార్టీకి చెందిన నాయకులు వేదికపై కూర్చుంటారని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఈ విషయంలో జవాబు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దాడుల సంస్కృతికి తమ పార్టీ వ్యతిరేకమని మీ వైఖరి మారకపోతే మేము కూడా మారాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఇక వేదిక పైన ప్రోటోకాల్ అమలు చేయాల్సిన స్థానిక తహసీల్దార్ ప్రతిపక్షనాయకుల కొమ్ముకొస్తున్నారని ఈ విషయంలోఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సహకార సంఘం డైరెక్టర్ ఎల్.పోశెట్టితో పాటు నాయకులు పాల్గొన్నారు.

17 వరకు మొక్కజొన్న కొనుగోలు నిలిపివేత

బోథ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ యార్డులో కొనుగోలు చేస్తున్న సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోళ్లను ఈ నెల 17 వరకు నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జీ గోలిస్వామి తెలిపారు. రైతులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని మార్కెట్‌కు పంటను తీసుకు రావద్దని సూచించారు. తదుపరి 17వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభమవుతాయన్నారు.

జిల్లా యువకుడికి అరుదైన అవకాశం

● ఇండియన్ ఆయిల్ ప్రతినిధిగా చవాన్ రాణా ఆశీష్

ఆదిలాబాద్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఆయిల్ కార్పొరేసన్‌లో కార్పొరేట్ కమ్యూనికేషన్స్ అధికారిగా పని చేస్తున్న చవాన్ రాణా ఆశీష్ ఏడీఐపీఈసీకి నామినేట్ అయ్యారు. ఇటీవల అబుదాబిలో జరిగిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఇంటర్నేషనల్ పెట్రోలియం ఎగ్జిబిషన్ అండ్ కాన్ఫరెన్స్‌కి జిల్లా యువకుడు అశిష్‌రాణి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం ఎనర్జీ రంగంలో ఎలాంటి వేగంతో ముందుకు వెళ్తుందో చూడడం జరిగిందన్నారు. ఇండియన్ ఆయిల్ పావిలియన్‌ను సందర్శించిన అనేక మంది భారతదేశ ఎనర్జీ పై ఆసక్తి చూపారు అన్నారు. ఈ సందర్భంగా ఇండియా ఉత్తమ అంతర్జాతీయ పావిలియన్‌గా ఎంపికై అవార్డు గెలుచుకుందన్నారు. చవాన్‌రాణి ఆశీష్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

అటవి ప్రాంతాల్లో యంత్రాలను ఉపయొగిస్తే చర్యలు తప్పవు

నేరడిగొండ13,అటవి ప్రాతాల్లో యంత్రాలను ఉపయొగిస్తే చర్యలు తప్పవని ఎఫ్ ఆర్వో గణేష్ అన్నారు, గురువారం అయన విలెకరులతో మాట్లాడుతు జిల్లా అటవీ అదికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అటవి మండల అదికారి రేవంత్ చంద్ర ఆదేశాల మెరకు అటవీ ప్రాంతాలలో యంత్రాలు వినియొగించి అటవీ ప్రాంతానికి నష్టం కలిగించడం చట్టవ యతిరేక చర్య అవుతుందని అటువంటి వారి యంత్రాలు జప్తు చేయడంతో పాటు ప్రభుత్వంద్వారా పోందుతున్న ప్రయొజనాన్ని నిలిపివేయడం జరుగుతుందన్నారు. యంత్రాల యజమానులు అటవి సంరక్షణకు సహకరించాలనిఎఫ్ ఆర్వో గణేష్ కోరారు,

న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ నిరసన

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై పోలీసుల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ అన్నారు. నిర్మల్‌లో న్యాయవాదిపై పోలీసులు దాడి చేసి కారును ధ్వంసం చేసిన ఘటనను ఖండిస్తూ గురువారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం కోర్ట్ ఎదుట ఆందోళన చేపట్టి డిమాండ్లను వెల్లడించారు. ఈ మేరకు ఎన్రాల నగేష్ మాట్లాడుతూ కోర్ట్ లో నిందితుడిని అప్పగించడానికి వచ్చిన న్యాయవాదిపై పోలీసులు దాడి చేసి కారును ధ్వంసం చేశారని, ఈ ఘటనను ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులపై దాడులు పునరావృతం కాకుండా న్యాయవాద రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉమేష్ డోలే, సుధీర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ఇంద్రవెల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టల్‌లో చదివే విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు రగ్గులను మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్ రావు, ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ తో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూని ఫాం, తదితర ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఐరన్ మ్యాన్ అవార్డు గ్రహీతకు సన్మానం



ఐరన్ మ్యాన్ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన ప్రపంచ ట్రయాథ్లాన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మూడు అంశాలలో రాణించి విజేతగా నిలిచిన పట్టణానికి చెందిన వైద్యుడు బిఎల్. నరసింహారెడ్డిని గురువారం బీజేపీ సీనియర్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, జిల్లా పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, బీజేపీ జిల్ల మాజీ అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అష్టనాగ కాలభైరవ సమేత ద్వాదశ జ్యోతిర్లింగ విగ్రహ ప్రతిష్ఠాపన

లోకేశ్వరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లోకేశ్వరాలయంలో నేటి నుంచి అష్టనాగ కాలభైరవ సమేత శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు శ్రీ గురుమంచి చంద్రశేఖర్ శర్మ వేద పండితుల ఆధ్వర్యంలో మూడు రోజులు శుక్రవారం, శనివారం, ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్య క్రమాన్ని నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మహా గణపతి పూజ, పుణ్య హవచనము నాంది, రక్షాబంధన, పంచగవ్య, ప్రా శాన ఆచార్యది రుత్విక్ వరణ, వాస్తు ఆరాధన, పర్యగ్ని కరణ, పూర్వక యాగశాల ప్రవేశ ద్వారా పూజ, కలశ పూజ, అఖండ దీపస్థాపన, అం కురార్పణ, కర్కరిస్థాపన ధ్వజారోహణ, వాస్తు క్షేత్రపాలక యోగిని నవ గ్రహ సర్వతో భద్ర మండప ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హో మం, వాస్తు క్షేత్రపాలక, యోగిని నవగ్రహ భద్ర మండప హవనము లు, పంచగవ్య, పంచామృత జలాధివాసములు, పూజా కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శివాలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు తెలియజేశారు.

విద్యార్థులకు క్రీడా వస్తువుల పంపిణీ

కుభీర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపాటిల్ కుమారుడు డా. సతీష్ పవార్ జన్మదినాన్ని పురష్కరించుకొని బీజేపీ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బొడిగాం వినయ్ కుమార్ విద్యార్థులకు ఉచితంగా 4 క్యారం బోర్డులు, షటిల్ బ్యాట్‌లు, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం వినయ్‌కుమార్ మాట్లాడారు. ముధోల్ నియోజక వర్గ క్యాన్సర్ రోగులకు డా. సతీష్ పవార్ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కారుల చరిత్ర పుస్తకాల పంపిణీ

కుంటాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర ముథోల్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం లింబా (కే) హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. జాదవ్ పుండలిక్ రావు పటేల్ తెలంగాణ ఉద్యమ కారుల చరిత్ర ముథోల్ పుస్తక రచయిత చాకేటి లస్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి బీజేపీ నాయకులు మల్లారెడ్డి, అడ్వకేట్ ఆష్టం నరేష్, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు ప్రదీప్, రాజేశ్వర్ రెడ్డి, భోజన్న, సతీష్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి) డబుల్ ధమాకా

» వరల్డ్ కప్ అంపైర్
రాష్ట్రస్థాయి క్రీడాకారిణి
» చెస్‌లో మండలానికి అంతర్జాతీయ,
రాష్ట్రస్థాయిలో అరుదైన గౌరవం



బహుమతి అందుకుంటున్న మోడపు సిలారి మధుప్రియ

నర్సాపూర్(జి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా, నర్సాపూర్(జి) మండలం నుంచి క్రీడల్లో ఒకేసారి రెండు గొప్ప విజయాలు నమోదయ్యాయి. ఒకరు అంతర్జాతీయ న్యాయనిర్ణేతగా, మరొకరు రాష్ట్రస్థాయి క్రీడాకారిణిగా మండల ఖ్యాతిని పెంచారు. మండలానికి చెందిన ఇంటర్నేషనల్ ఆర్బిటర్ గాడి అరుణ్ కుమార్ ప్రతిష్టాత్మకమైన ఎఫ్ఐడీఈ చెస్ వరల్డ్ కప్ 2025కు అధికారిక న్యాయనిర్ణేతగా ఎంపికయ్యారు. ఈ అంతర్జాతీయ ఈవెంట్‌కు తెలంగాణ నుంచి ఏకైక న్యాయనిర్ణేతగా ఎంపిక కావడం విశేషం. అలాగే ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని మోడపు సిలారి మధుప్రియ కూడా చెస్‌లో అద్భుతం సృష్టించింది. మంచిర్యాల తాండూర్‌లో జరిగిన జోనల్ పోటీల్లో గురువారం విజయం సాధించింది. ఈ నెల 16న జగిత్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందింది. తల్లిదండ్రులు కవిత, రాజశేఖర్ సహకారంతో ఈ విజయాన్ని సాధించినట్లు మధుప్రియ తెలిపింది. ప్రధానోపాధ్యాయులు రవీంద్ర కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు దర్శనం దేవేందర్‌తో సహా మండల ప్రజలు మధుప్రియ భవిష్యత్తులో వరల్డ్ కప్ ఛాంపియన్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అందెశ్రీకి అక్షర నివాళి



అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రచయితలు

నిర్మల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అందెశ్రీకి అక్షర నివాళులు అర్పించినట్లు జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు తెలిపారు. నిర్మల్ నర్సింగ్ హోమ్ డాక్టర్ దామోర సాహితీ క్షేత్రంలో శుక్రవారం అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించి, ఘన నివాళులు అర్పించారు. అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని, వారి ఆత్మ శాంతించాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ దామోర రాములు, డాక్టర్ అప్పాల చక్రధారి, డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ తుమ్మల దేవరావు, ముని మడుగుల రాజారావు పాల్గొని ప్రసంగించారు. అందెశ్రీ నిరుపేదగా జన్మించి, అవమానాలను ఎదుర్కొని, కన్నీటిని హృదయంలో దాచుకొని అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని జీవించిన గొప్ప రచయిత అని, సమాజాన్ని, వ్యక్తులను శ్రమ జీవులను, పేదరికాన్ని అల వోకనం చేసుకొని ప్రజల పక్షాన నిలబడి రచనలు చేసిన గొప్ప కవి అని, తెలంగాణ ఉద్యమంలో తమ పాటల ద్వారా ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన రచయిత అని, జయ జయహే తెలంగాణ జనని జయ కేతనం అని రాష్ట్ర గీతాన్ని రాసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయాడని, గంగ సినిమాకు నంది అవార్డును అందుకున్నారని, సమాజ ఆరోగ్యాన్ని కోరుకున్న కవి తన ఆరోగ్యాన్ని కాపాడుకోలేక పరమ పదించడం విచారకరమని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో కవి రచయిత కె.మురళీధర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ దేవి దాస్, పోలీస్ భీమేష్, కుమ్మరి నాగారం, పత్తి శివ ప్రసాద్, చాట్ల గజ్జారాం, కిషన్, సత్యనారాయణ, రవి, శ్రీనివాస్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పథకాలు సక్రమంగా అమలు చేయాలి

» అర్హులైన ప్రతీ నిరుపేదకు ప్రభుత్వ పథకాలను అందించాలి
» నిరుపేదల అభ్యున్నతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం
» నాలుగు మండలాల అధికారులతో సమీక్షించిన నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పథకాలన్నింటినీ సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ నాలుగు మండలాల అధికారులతో, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతీ నిరుపేదకు ప్రభుత్వ పథకాన్ని అం దించేలా క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టాలని వారు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు ద్వారా నిరుపేదల అభ్యున్నతి సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కలలు నెర వేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్లంటిని త్వరగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలన్నారు. వివిధ మండలాలలో అటవీ శాఖ సమస్యలతో పెండింగ్‌లో ఉన్న 250 ఇళ్లను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఆయా రకాల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కాంట్రాక్టర్లు వాటిని పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే గుత్తేదారులను మార్చేందుకు వెనుకడుగు వేయవద్దని సూచించారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, త్రాగునీరు, వంతెనలు, గృహాలు, విద్యుత్ అందించి వారి జీవన ప్రమాణాలను పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఎఫ్‌వో నాగిని భాను, ఆర్డీవో రత్న కళ్యాణి, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, ఉద్యో గులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నందిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం ఎదుట గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కే.రాజు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలో పాఠ్యపుస్తకాలను తీసుకువెళ్తున్న ఆటో బోల్తాపడి విద్యార్థులకు గాయాలైన ఘటనలో సమగ్ర శిక్ష ఉద్యోగులను బాధ్యులను చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ జి.స్వామి, కంప్యూటర్ ఆపరేటర్ శివలింగం, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ డి. రాములుయాదవ్ టర్మినేట్ చేయాలన్న ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యాసాగర్, సురేష్, హేమంత్, శ్రీనివాస్, నాగేష్ గౌడ్ తదితరులున్నారు.

న్యాయవాదిపై దౌర్జన్యానికి పాల్పడ్డ పోలీసులను శిక్షించాలంటూ విధుల బహిష్కరణ



ఉట్నూర్‌లో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ఉట్నూర్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ కోర్టులో బుధవారం తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న న్యాయవాది పి.అనిల్‌కుమార్ పైన అక్కడి సీఐ కృష్ణ, ఎస్సైలు సంజీవ్ అశోక్‌లతో పాటు వారి సిబ్బంది తీవ్ర దౌర్జన్యానికి పాల్పడి న్యాయవాది వాహనాన్ని తీవ్రంగా ధ్వంసం చేసిన పోలీసుల వైఖరిని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ఎదుట కొద్దిసేపు నిరసన చేసి అనిల్‌కుమార్‌కు సంగీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి ఉపాధ్యక్షుడు జగన్‌నాయక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న న్యాయవాది పై కోర్టు ఆవరణలో పోలీసులు దౌర్జన్యానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చట్టాలు ఎవరికి చుట్టాలు కాదని అలాంటిది పోలీసులు మర్చిపోయి చట్టాలను తమ చేతుల్లోకి తీసుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. న్యాయవాదిపై దౌర్జన్యానికి పాల్పడి వాహనాన్ని ధ్వంసం చేసి న్యాయవాద వృత్తిని అవమానపరిచిన పోలీసు అధికారులపై వారికి సహకరించిన సిబ్బం దిపై ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.జైవంత్‌రావు, న్యాయవాదులు జమీర్‌ఖాన్, ధీరజ్ గుప్తా, పెందూర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి

కుంటాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాక్‌పట్ల గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులతో భూ వివాదంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ కుంటాల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుంటాల మండల అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ ఈ విషయంలో తమకు న్యాయం జరిగేలా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి


ఇచ్చోడలో ఇంకుడుగుంతను తవ్వుతున్న బోథ్ ఎమ్మెల్యే


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే

- అధికారులు నిర్లక్ష్యం వీడేలా కలెక్టర్ చర్యలు
- ఇంద్రవెల్లిలో ఇంటింటా ఇంకుడు గుంత

ఉట్నూర్/ఇంద్రవెల్లి/ఆదిలాబాద్‌రూరల్/ఇచ్చోడ/బోథ్ నవంబరు13 (ఆంధ్రజ్యోతి):భూగర్భజలాలు సంరక్షించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన మనబడి మననీరు, జల సంచయ్ జన్ భోగిదారి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజార్షి షా,ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్, ఐటీడీఏప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్‌లు ప్రారంభించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తా నుంచి పాఠశాల విద్యార్థులతో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆదిలాబాద్ కలెక్టర్, ఎమ్మెల్యే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రాథోడ్‌రవీందర్, ఇన్‌చార్జీ ఎంపీడీఓ సుధీర్‌రెడ్డిలు కలిసిపాదయాత్ర ద్వారాజిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకుముందుగా చేరుకుని పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత పనులను ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం శీతల్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తోటకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడ ఇంకుడు గుంతను పనులను ప్రారంభించి నూతనంగా నిర్మించిన అదనపు గదులకు ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ మాట్లాడుతూ మన ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే ఎక్కువ వర్షాలు పడతాయని, వర్షపు నీటిని వృదా చేయకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఇండ్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని, వారికి ప్రభుత్వం డబ్బులు కూడా మంజూరు చేస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి పేద స్థాయి నుంచి తన కలను అక్షరాలతో జత చేసి జయజయహే తెలంగాణ అనేపాటను రాష్ట్రగీతంగా గుర్తించే స్థాయికి ఎదిగిన అందేశ్రీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని పంచాయతీరాజ్, ఐటీడీఏ, రెవెన్యూ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, చిన్న తరహా నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంవీడేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ జిల్లాలో మనబడి మననీరు పథకం ద్వారా 475ఇంకుడు గుంతలు నిర్మించాలని భావించామని అందులో మొదటి దశలో 109 నిర్మిస్తామన్నారు.భూగర్భజలాలు తగ్గిపోయాయని ఆదిలాబాద్ జిల్లా క్రిటికల్ పోజిషన్లో ఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లా శైలు జోన్లో ఉండడం వల్ల భూగర్భ జలాలు మరింత భూమిలోపలికి వెళ్తున్నాయన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులు జల్‌జంగల్ జమీన్ కోసం ఎప్పటి నుంచో కృషి చేస్తున్నారని జల్ ఉంటేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే బహుమతులు, సర్టిఫికేట్స్ అందజేశారు. కళాకారులు అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని పాడుతు ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో డీడీ జాదవ్ అంబాజి, ఏటీడీఓ సదానందం, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ బానోత్ జయవంత రావు, డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రజినికాంత్, ప్రధానోపాధ్యాయులు శీతల్‌చౌహాన్, మాణిక్‌రావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బానోత్ శ్రీవేణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇక్బాల్, చంద్రయ్య, మర్సుకోల తిరుపతి, అజీముద్దిన్; పెందూర్ కళావతి పాల్గొన్నారు. ఇంద్రవెల్లిలో ఇంటింటా ఇంకుడు గుంత నిర్మిం చుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీప్రియ పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఎంఈవో రాథోడ్ మాను కుమార్, ఉపాధిహామీ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ రూరల్‌లో మన బడి - మన నీరు కార్యక్రమం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటిని నిలుపుదల చేయడమే ప్రధాన లక్ష్యమని ఎంపీడీవో వంశీకృష్ణ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం లోని ఐదు గ్రామపంచాయతీల్లోని పాఠశా లల్లో మన బడి- మననీరు కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఇచ్చోడలో ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి భావితరాలకు ఆదర్శవంతంగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రాజేశ్వర్ రాథోడ్, ఎంపీడీఓ నరేష్ కుమార్, ఈఓ సురేష్, పాఠశాల ప్రిన్సిపల్ కిషన్ చౌహాన్, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, నాయకులు సుభాష్, పాండు గణేష్ తదితరులు పాల్గొన్నారు. బోథ్‌లో ప్రతీ వర్షపు చుక్కను వృథాగా పోనియకుండా భూమిలోకి ఇంకే విధంగా చూడాలని ఫలితంగా భూగర్భజలాలుపెరుగుతాయని సోనాల ఎంపీడీవో మహేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, మండల విద్యాధికారి మహ్మద్‌హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇంద్రవెల్లి వర్షపునీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపును ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎస్సీ హాస్టల్‌లో మన బడి-మన నీరు కార్యక్రమం భాగంగా ఇంకు డు గుంతలపై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు,ఐకేపీసీసీ రాథోడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్


భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో వంశీకృష్ణ


జలసంరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


బోథ్‌లో..

క్రైం సమాచారం

నిజాయితీ చాటిన యువకుడు


సీఐ స్వామికి నగదు అందిస్తున్న షేక్ ఫహీం

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన షేక్ ఫహీమ్ తన నిజాయితీ చాటాడు.వృత్తిరీత్యా రాడ్ వెల్డింగ్ పనులు చేస్తుండే ఆయనకు స్థానిక కరాచీ బేకరీ వద్ద ఉన్న ఎస్ బీఐ ఏటీఎం వద్ద రూ.20 వేల నగదు దొరికింది. ఫహీమ్ ఏటీఎం వద్ద డబ్బు తీసుకునేందుకు వెళ్లిన సమయంలో యంత్రంలో మరొకరి డబ్బు మిగిలి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఆ డబ్బును మావల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ స్వామికి అప్పగించాడు. సీఐస్వామి షేక్ ఫహీమ్‌ను అభినందించారు. తనది కాని డబ్బుపై ఆశ పడకుండా వెంటనే వాటిని పోలీసులకు అప్పగించడం పట్ల ప్రశంసించారు.

ద్విచక్ర వాహనం చోరీ

బోథ్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర పెట్రోల్ పంపు సమీపంలో నిలిపి ఉంచిన ద్విచక్ర రాత్రి దొంగలు ద్విచక్ర వాహనం టీఎస్‌జీరోవన్‌ఈఎల్5167 వాహనం నిలిపి వేరే గ్రామానికి వెళ్లడం జరిగింది. మంగళవారం రాత్రి వచ్చి చూసే సరికి తన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించి వెళ్లడం జరిగిందని బాధితుడు వాపోయాడు. దీంతో అదే రోజు మంగళవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జైలు

నిర్మల్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయస్థానం ఆరు రోజుల జైలు శిక్ష విధించారని రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఎల్లపల్లి గ్రామానికి చెందిన మిశ్రం మనోహర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసునమోదు చేసినట్టు తెలిపారు. గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా న్యాయాధికారి ఆరు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. కావునా ఎవరైనా మద్యం తాగి నడిపితే జైలు శిక్ష తప్పదని ఎస్సై అన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో కోర్టు ముగ్గురికి జైలు శిక్ష విధించింది. వీరిలో నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుస్లీ గ్రామానికి చెందిన కండెల రాజేశ్వర్‌ను పోలీసులు పట్టుకోగా కోర్టు ఆయనకు ఐదురోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహ నాలు నడపడం తీవ్రమైన నేరమని, తమతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే వ్యక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఖానాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా యువతకి మత్తు పదార్థాల ను అలవాటు చేస్తున్న గంజాయి విక్రయిస్తున్న వారి గుట్టును ఖానాపూర్ పోలీసులు రట్టు చేశారు. మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అజయ్ కుమార్ వివరాలు వెల్లడించారు. సీఐ అజయ్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం..పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన బుట్టి మనోహర్, సుభాష్ నగర్ కాలనీకి చెందిన బోదాసు రాము అనే ఇద్దరు వ్యక్తులు గత కొంతకాలంగా నిషేధిత గంజాయిని యువతకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం. ఈ రహస్య సమాచారం మేరకు వీరిపై నిఘా ఉంచగా గురువారం పట్టణ శివారులోని సదర్మాట్ కాలువ సమీపంలో వీరిరువురు కోట్నాకరాము అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఖానా పూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలంలో దాడులు నిర్వహించగా మూడు కిలోల గంజాయి పట్టుబడింది. ఈ గంజాయితో పాటు బుట్టి మనోహర్,బోదాసు రాము అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, జ్యోతిమణి, తదితరులున్నారు.

మహిళ ప్రాణాన్ని కాపాడిన డయల్ 100

ముథోల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ పోలీస్ నారీశక్తి బృందం సమయ స్ఫూర్తితో స్పందించి ఆత్మహత్యకు యత్నించిన మహిళ ప్రాణాన్ని రక్షించిన సంఘటన ముథోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఈ ఘటనపై గురువారం ఉదయం పత్రిక ప్రకటనలో వివరాలు తెలియజేశారు. ముథోల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ కుటుంబ సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించారు. ఈ సమాచారం డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న ముథోల్ పోలీసులు నారీశక్తి బృందం సమయస్ఫూర్తితో స్పందించి తక్షణమే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ మహిళను రక్షించారు. అనంతరం ముథోల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. మహిళలు ఎలాంటి సమస్యల్లో ఉన్న తక్షణ సహాయం కోసం డయల్ 100కు ఫోన్ చేయవచ్చన్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడు ప్రజల రక్షణకు సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముథోల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మల్లేష్, ఎస్సై పెర్సిస్ పర్యవేక్షణలో విధుల్లో ఉన్న నారీ శక్తి బృందం సమయానికి స్పందించి మహిళ ప్రాణాలను రక్షించినందుకు ఎస్పీ అభినందించారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ

దిలావర్‌పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం గురువారం తనిఖీ చేశారు. ప్రతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వార్షిక పరీక్షలకు కేవలం వంద రోజులు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. అనంతరం బోధన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక అంశాలపై సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తి సిలబస్‌పై ఆరా తీశారు. వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని 90 రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. గత పది రోజులుగా కళాశాలకు హాజరు కాని విద్యార్థులను వెంటనే గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచడానికి ఎక్కువ సంఖ్యలో స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు.

9వ, 10వ తరగతి విద్యార్థులను కలవాలి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 9వ, 10వ తరగతి విద్యార్థులను కలిసి వారికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సౌకర్యాలు, అందిస్తున్న గ్రూపుల వివరాలను తెలియజేయాలని మాధ్యమిక అధికారి అధ్యాపకులకు సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలలో ఉచిత, నాణ్యమైన, ఒత్తిడి లేని విద్య అందుబాటులో ఉందనే విషయాన్ని విద్యార్థులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం మరిచిన బంధువులు

● అంత్యక్రియలు నిర్వహించిన ఐక్యత సేవా సమితి

నిర్మల్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంధుత్వ బంధాలు నేటి కాలంలో కేవలం పేరుకే మిగిలిపోయాయనే దానికి జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న సంఘటన తార్కాణమైంది. పట్టణంలోని గవర్నమెంట్ దవాఖానలో ముసలయ్య మరణించగా, అతని శవాన్ని చూసిన బంధువులు అటు ఇటు తిరిగినా ఒక్కరూ దగ్గరికి రాలేదు. అంత్యక్రియల కోసం కొడుకు సహాయం కోరినా అతని ఆర్థిక పరిస్థితిని చూసి ఎవరూ చేయూత ఇవ్వలేదు. చివరికి ఆ ముసలయ్య శవం దవాఖానలోనే వదిలిపెట్టే పరిస్థితి తలెత్తింది. ఈ విషయం తెలిసిన ఐక్యత సేవా సమితి సభ్యులు అక్కడికి చేరుకుని, బంధువులకు మానవత్వం గుర్తు చేస్తూ వారికి నచ్చజెప్పారు. చివరికి స్వయంగా అంత్యక్రియలకు పూనుకుని, ముసలయ్యకు గౌరవప్రదంగా చివరి యాత్ర నిర్వహించారు. మానత్వానికి మచ్చతెచ్చిన సంఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ముందుకు వచ్చి సేవ చేస్తున్న ఐక్యత సేవా సమితి సేవాభావానికి అభినందనలు వెలువెత్తుతున్నాయి. మానవత్వామే మహోన్నత సేవ అంటూ సమితి సభ్యులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న లక్ష్మీనారాయణ స్వామి మహాజాతర

- భక్తులతో పోటెత్తిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం
- జనసంద్రం అయిన జైనథ్ జాతర


జైనథ్ ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

జైనథ్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండల కేంద్రంలో గల జైనథ్‌లక్ష్మీ నారాయణ స్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా ఆలయ ఆవరణలో జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి మహాజాతర కొనసాగుతుంది. ఇందులో భాగంగా గురువారం తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు మహిళలు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు.ఆలయ ఆవరణలో పది రోజుల పాటు కొనసాగే మహాజాతరలో మహిళలు,భక్తులు జాతరలో వెలసిన దుకాణాలలో వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. చిన్న పిల్లలు జాతరలో వెలసిన ఉయాలలో ఊగి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆలయం వేలాది మంది భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జైనథ్ ఎస్సై గౌతం పవార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఉట్నూర్ ప్రాంత ప్రజల కోసం సాండ్‌బజార్

ఉట్నూర్,నవంబర్13(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఇళ్లు కట్టుకోవాలంటే ఇసుక (సాండ్) కోసం ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు, ఆర్థిక నష్టం ఎదుర్కొంటుండడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కృషితో ఏజెన్సీ ప్రాంత ప్రజల కోసం ఉట్నూర్ మండల కేంద్రంలో సాండ్‌బజార్ అందుబాటులోకి వస్తుంది. ఏజెన్సీ ప్రాంతం చుట్టు కవ్వాల్ టైగర్‌జోన్ ఉండడంతో అడవుల నుంచి ఇసుక తీసుకు రావడం కష్టంగా మారడంతో ఇల్లు కట్టే వారికి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐటీడీఏ రెంటల్ క్వార్టర్స్ సమీపంలో సాండ్ బజార్ ఏర్పాటుకు అధికారులు కృషి పూర్తి చేశారు. రూ.లక్షల వెచ్చించి తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు వేయింగ్ మిషన్‌తో పాటు కంప్యూటర్ గదిని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని చెన్నూర్ ప్రాంతంలో ఉన్న వేలాల రిచ్ నుంచి ఇసుకను ఉట్నూర్‌కు రప్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సైతం ఇసుక అందుబాటులో లేకపోవడంతో, కవ్వాల్‌టైగర్ జోన్ పరిధిలోని అడవుల్లో ఉన్న ఇసుకను తీసుకోకుండా అటవీశాఖ నిషేదించడంతో ఇందిరమ్మ ఇళ్ల పనులకు సైతం ఇసుక కొరత ఏర్పడింది. దీంతో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ప్రభుత్వంలోని ముఖ్యులతో మాట్లాడి ఉట్నూర్‌లో సాండ్ బజార్ ఏర్పాటు చేయడానికి శతవిధాల కృషి చేయడంతో ఎట్టకేలకు ఉట్నూర్ మండల కేంద్రంలో సాండ్ బజార్ అందుబాటులోకి వచ్చింది.మరో నాలుగు రోజుల్లోసాండ్ బజార్‌ను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తుంది.


ఉట్నూర్‌లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన సాండ్‌బజార్

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శివనోళ్ల నరేష్(ఫైల్)

నర్సాపూర్(జి), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌కు చెందిన శివనోళ్ల నరేష్(27) అక్టోబరు 31న హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చివరకు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. ప్రమాదం తర్వాత నరేష్‌ను మొదట ఆదిత్య, నిమ్స్ (హైదరాబాద్) ఆపై స్వప్న, విష్ణు వంటి పలు ప్రైవేట్ ఆసుపత్రులలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం పలు ఆసుపత్రులు తిరిగినా గురువారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. సరైన వైద్యం అందకపోవడంపై స్నేహితులు, బంధువులు, ప్రైవేట్ ఆసుపత్రుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య శివనోళ్ల ప్రత్యూషతో పాటు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు.దిక్కుతోచని స్థితిలో ఉన్న ఈ కుటుంబాన్ని ప్రభు త్వం తక్షణమే ఆదుకొని, అండగా నిలవాలని స్థానిక ప్రజాప్రతి నిధులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. నరేష్ భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

స్విమ్మింగ్‌లో కొమ్ము చరణ్‌తేజ్ ప్రతిభ


పోటీల్లో గెలుపొందిన వారిని అభినందిస్తున్న అతిథులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన కొమ్ము చరణ్‌తేజ్ స్విమ్మింగ్‌లో ప్రతిభ. ఇటీ వల జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆయన..తాజాగా ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తాచాటాడు.హైదరాబాద్ లోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చరణ్ తేజ్ కాంస్య పతకం సాధిచాడు.400 మీటర్ల ఐఎం (ఇండివిద్యుఅల్ మెడ్లే) విభాగంలో కాంస్యం సాధించి మరోసారి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలిపారు. రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన చరణ్ తేజ్‌ను డీవైఎస్‌వో జక్కులశ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరిగోవర్ధన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామేశ్వర్, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని రవికుమార్, ప్రధాన కార్యదర్శి, ప్రముఖ స్విమ్మింగ్ కోచ్‌కొమ్ముకృష్ణ, ఉపాధ్యక్షుడు లాలా మున్న,సుంకుచిన్న, కోశాధికారి హరిచరణ్, బారే శ్రీధర్, రాష్ట్ర పాల్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు .భవిష్యతులో మరిన్ని విజయాలు సాధించి.. ఉన్నతంగాఎదగాలని ఆకాంక్షించారు.చిన్న వయసులోనే స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబరుస్తూ..జిల్లా కీర్తిని ఇను మడింప చేస్తున్న చరణ్‌తేజ్..మరిన్నివిజయాలు సాధించాలన్నారు.

గ్రామీణ పాఠశాలలకు కంప్యూటర్లు అందజేయాలి


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

నిర్మల్‌రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్లు తప్పనిసరిగా అందజేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం జిల్లా ముఖ్య కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రతి పాఠశాలకు రెండు కంప్యూటర్ల చొప్పున కేటాయించి కంప్యూటర్ బోధకులను నియమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పీఆర్సీ కమిటీ ఎన్నిక ఆధారంగా 42 శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని, ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు జారీ చేసి నగదు రహిత వైద్యానికి ఒక ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని అదే విధంగా పెండింగ్‌లో ఉన్న మొత్తం బకాయిలను జీపీఎఫ్ టీఎస్‌జీఎల్‌ఐ తదితర బకాయిలను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని, రిటైర్మెంట్‌ను అధికారికంగా మండల కేంద్రాలలో నిర్వహించి అదే రోజు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, గరుడ సునీల్, భూక్యా రామా నాయక్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ చెరువులో పడి ఒకరి గల్లంతు

- గజ ఈతగాళ్లతో గాలిస్తున్న పోలీసులు


ప్రశాంత్ (ఫైల్)

భైంసారూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):మండ లంలోని కామోల్ గ్రామానికి చెందిన ప్రశాంత్ కా మోల్‌లో గ్రామ సమీపంలో ఉన్నపోచమ్మ చెరువులో పడి ప్రశాంత్ గల్లంతు.గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తన వస్తువులు చూసి గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ప్రశాంత్ (38) గ్రామ పోచమ్మ చెరువులో పడి మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. చెరువ వద్ద చెప్పులు, సెట్ మొబైల్ చూసి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల పిటిషన్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. శుక్రవారం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేసి మృతికి గల కారణాలు తెలుపనున్నారు.

కడెంలో ప్రైవేట్ క్లినిక్ సీజ్

కడెం,నవంబరు13(ఆంధ్రజ్యోతి):జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ కడెంలో ప్రైవేట్ క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 నియమ నిబంధనలు ఉల్లంఘించినందుకు క్లినిక్‌ను సీజ్ చేయడం జరిగింది.ఈసందర్భంగా జిల్లావైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ. .ఆర్ఎంపీ వైద్యుడుయాంటీ బయోటిక్స్, ఇంజక్షన్స్, సెలైన్‌బాటిల్స్ పెట్టకూడదని తెలియజేశారు.నియమనిబంధనలు ఉల్లంఘించిన వారిపైఇకపై కఠినంగా చర్యలు తీసుకుం టామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ,మీడియా అధికారి బారె రవీందర్, డీపీవో రామచందర్ పాల్గొన్నారు.


ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న అధికారులు



ఇంకుడు గుంతలతోనే జల సంరక్షణ 6
విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీస్తాం 8
అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి 6
ఆపరేషన్ డాగ్ కంట్రోల్ 8



కొనసాగుతున్న లక్ష్మీనారాయణ స్వామి మహాజాతర

వివరాలు 7లో..



- జిల్లాలో అత్యల్పంగా 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- పెరిగిపోతున్న చలితీవ్రత
- వసతిగృహాల్లో వణికిపోతున్న విద్యార్థులు
- పంటలను చుట్టుముడుతున్న చీడపీడలు
- అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యుల హెచ్చరికలు

జిల్లాలోని పరిసర ప్రాంతాల్లో కమ్ముకున్న పొగమంచు

చలి పంజా

ఆదిలాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రికార్డుస్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. గత కొద్దిరోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో జిల్లాపై చలి పంజా విసురుతోంది. రాత్రివేళ్లతోపాటు ఉదయం,సాయంత్రం వేళల్లోనూ చలిమంటలను వేసుకుంటూ జనం వెచ్చదనం పొందుతున్నారు. చలితో వేడినీళ్ల స్నానం తప్పనిసరిగా మారుతోంది. గురువారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29.8 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 10.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా నేరడిగొండ మండలంలో 9.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే సోనాలలో 9.8, బోథ్ మండలం పొచ్చెరలో 9.9, సాత్నాలలో 10.3, భీంపూర్ మండలం అర్లి(టి)లో 10.5, ఆదిలాబాద్ మండలం పిప్పల్‌ధరిలో 10.6, తలమడుగులో 11.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడం ఇదే తొలిసారి. ప్రతియేటా జిల్లాలో డిసెంబర్, జనవరి మాసాలలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కనిపిస్తాయి. జిల్లాలో మూడుకాలాలు అధికంగానే ప్రభావం చూపుతాయి. గత కొద్దిరోజులుగా వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా కూలీలు, పారిశుధ్య కార్మికులు, రైతులు, వాకర్స్ చలితీవ్రతకు వణికిపోతున్నారు. కొందరు దాతలు ముందుకు వచ్చి వెచ్చని



భీంపూర్ మండలం అర్లీ(టీ) గ్రామంలో పశువులను చలిబారి నుంచి కాపాడటానికి గోనె సంచులు కప్పుతున్న రైతు

దుస్తులను అందజేస్తున్నారు. చలితీవ్రత పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాల ని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయి చలి పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

రాత్రి, పగలు వణుకే..

రాత్రి, పగలు అనే తేడా లేకుండా చలితో అంతా గజగజ వణికిపోతున్నారు. ఎక్కడలేని విధంగా పట్టపగలే వెచ్చని దుస్తులు ధరించి బయటకు వెళ్తున్నారు. యేటా డిసెంబర్ మాసంలోనే చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. కానీ ఈయేడు నవంబరు మాసంలోనే 10 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఈ యేడు అధికవర్షాలు కురవడం నల్లరేగడి నేలల ప్రభావంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. గతేడు 3.6 డిగ్రీలకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో రికార్డు నమోదైంది. ఉత్తర భారతదేశం నుంచి (మిగతా 6లో..)

నవంబరు 8 నుంచి జిల్లాలో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు డిగ్రీలలో..

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
నవంబరు 8	31.8	14.2
నవంబరు 9	32.3	14.7
నవంబరు 10	29.0	12.0
నవంబరు 11	29.3	11.2
నవంబరు 12	29.8	11.7
నవంబరు 13	29.8	10.7



ప్రమాద ప్రదేశాలను పరిశీలిస్తున్న ఎస్పీ

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఇచ్చోడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టనున్నారు. గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ మండలాల పరిధిలోని జాతీయ రహదారిపై ఉన్న ప్రమాద ప్రదేశాలను రెవెన్యూ, పంచాయితీ రాజ్, నేషనల్ హైవే ఆథారిటి కాంట్రాక్టర్లతో కలిసి ఎస్పీ పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా జాతీయ రహదారిపై వేగ నియంత్రణ చేసేందుకు రంబుల్ స్ట్రిప్స్, అప్రోచ్ రోడ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని, నిర్మాణ ప్రదేశాలలో తగు సూచిక బోర్డులను ఏర్పాటుచేయాలన్నారు. రాత్రి సమయాల్లో కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లను ఏర్పాటుచేసి ప్రమాదాలను నివారించాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, సీఐ బండారి రాజు, ఎస్సైలు శ్రీకాంత్, పురుషోత్తం, ఇమ్రాన్, సిబ్బంది, ఆయా శాఖల అదికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఆదిలాబాద్ టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 12 ద్విచక్ర వాహనాలకు శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎక్సైజ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ ఆధ్వర్యంలో వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వం నిర్దేశించిన ధరావతు సొమ్మును చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

18న ఢిల్లీకి కలెక్టర్

ఉట్నూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న జిల్లా కలెక్టర్ రాజార్షిషా న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కలెక్టర్ రాజార్షిషాకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలో జరిగిన మన బడి - మన నీరు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరుకావడంతో సభావేదికపై ఎమ్మెల్యే శుభాకాంక్షలు చెప్పి కలెక్టర్‌గా సమన్వయంతో అన్నిపనులు చేపడుతూ జిల్లాకు మంచి పేరు తెస్తున్నారని అభినందించారు. జల్ సంచయ్ జన్ భాగిదారి కార్యక్రమాన్ని విజయవంతంగా చేపడుతుండడంతో కలెక్టర్ అవార్డు అందుకోనున్నారని ప్రశంసించారు.



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న కలెక్టర్ రాజార్షిషా

విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. క్రీడారంగంలో రాణిస్తే అనేక ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చని చెప్పారు. గురువారం స్థానిక హౌసింగ్ బోర్డులోని మహాత్మా జ్యోతి బాపులే పాఠశాల, కళాశాలలో జరిగిన క్రీడావార్షిక ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయం ప్రారంభమవుతోందని, ఆదిలాబాద్, జాతర్ల, ఉట్నూర్‌లలో ఇప్పటికే క్రీడా పాఠశాలలు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో గురువారం ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్ 19 క్రికెట్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. డీఐఈఓ గణేష్ జాదవ్, డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థ సారథి ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబర్చాలన్నారు.

ప్రొటోకాల్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

బోథ్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన ప్రొటోకాల్ రగడపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. అయితే ప్రొటోకాల్ విషయంలో అధికారులు ముందుచూపుగా వివరించక పోవడం వల్లే దాడులు జరిగాయని చెప్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పదవులు అనుభవించినవారు వేదికపై పూరించడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడే ఉన్న స్థానిక తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. అధికారంలో లేనివారిని వేదికపై ఎలా కూర్చొబెట్టారని ప్రశ్నించడంతో వేదికపై ఉన్న బీఆర్ఎస్ నాయకులు లేచిపోతుండగా వాగ్వాదం జరగడం, పరస్పర దాడులు కొనసాగాయి. ప్రొటోకాల్ పాటించని అధికారులపైనా జిల్లా ఉన్నతాధికారులకు కొంతమంది స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. కలెక్టర్ తగు విచారణ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ప్రొటోకాల్ వివాదం అధికార ప్రతిపక్ష నాయకుల మధ్య రాజకీయ వివాదాలకు తెరలేపినట్లు అయింది.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జిల్లాకేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని జిల్లాకేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వినాయక్‌చౌక్ నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని మాట్లాడారు. బాంబు పేలుళ్లలో అమాయకులు తనువు చాలించారని అన్నారు. వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరలో కోలుకోవాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతి, మహేందర్, సంతోష్, హన్మాండ్లు పాల్గొన్నారు.

ప్రతీఒక్కరు భక్తిమార్గంలో నడవాలి

ఉట్నూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు భక్తి మార్గంలో నడాలని, నిస్త్రేద్రవేసింగ్ మహరాజ్ అన్నారు. మండలంలోని ఆందోళి గ్రామంలో గురువారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆయన హాజరై భక్తి ప్రవచనాలు గావించారు. తాను గ్రామాలలో పర్యటించి గ్రామస్థులకు సనాతన ధర్మం గురించి వివరిస్తూ భక్తి మార్గంతో నడవాలని చెప్తున్నానని చెప్పారు. సనాతన ధర్మం అత్యంత శ్రేష్ఠమైన మార్గాలలో ఒకటి అన్నారు. ఇది భగవంతునిపై ప్రేమ, విశ్వాసం, సమర్పణ, మరియు ఆత్మ నివేదనతో కూడిన ఆధ్యాత్మిక జీవన విధానమని సూచించారు. సనాతన ధర్మం (హిందు సనాతన పరంపర) భక్తిని మానవ జీవితంలోని పరమ లక్ష్యమైన మోక్షానికి దారి తీసే మార్గంగా భావిస్తుందని తెలిపారు. భక్తిఅంటే భగవంతునిపై గాఢమైన ప్రేమ, ఆయనలోనే తనను తాను లయమయ్యే స్థితి అని పేర్కొన్నారు. మన హృదయంలోని పవిత్రమైన భావమని భగవంతున్ని ఏ రూపంలోనైనా (రాముడు, కృష్ణుడు, శివుడు, దేవి,లేదా నిరాకార బ్రహ్మం) ఆరాధించడం భక్తి మార్గంలో భాగమని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి పులిమడుగు మాజీ ఉప సర్పంచ్ బాలాజి ఆధ్వర్యంలో మహారాజ్‌ను సన్మానించారు.

పత్తి రైతులు ఆందోళన పడొద్దు

- ఎకరానికి 7 క్వింటాళ్లు దాటితే అధికారులను సంప్రదించాలి: వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రీధర్‌స్వామి

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లపై రైతులు ఆందోళన పడొద్దని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శ్రీధర్‌స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరానికి ఏడు క్వింటాళ్ల కంటే ఎక్కువ దిగుబడి వచ్చిన కైలు రైతులు సంబంధిత వ్యవసాయ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు. పత్తిపంట ఉత్పత్తిని వ్యవసాయ విస్తరణాధికారి పరిశీలించి దిగుబడి ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తారని, ఆన్‌లైన్‌లో నేరుగా కొనుగోలు కేంద్రానికి పంపుతారని తెలిపారు.

తేమ శాతానికి అనుగుణంగా మద్దతు ధర

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోళ్లలో నిబంధనల ప్రకారం 8 నుంచి 12 తేమ శాతానికి అనుగుణంగా మద్దతు ధర ఇస్తున్నట్లు సీసీఐ బ్రాంచ్‌హెడ్ పునిత్ రాఠి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తిపంటను ఆరబెట్టిన తర్వాతే మార్కెట్ యార్డుకు తీసుకురావాలని పేర్కొన్నారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా అనువైన సమయానికి స్లాట్‌బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఎటువంటి సందేహాలు ఉన్నా రైతులు సహాయం కోసం బ్రాంచ్ ఆఫీస్‌ను సంప్రదించాలని, వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 8332807008ను సంప్రదించవచ్చని ఈ సందర్భంగా తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి సద్దాం అన్నారు. గురువారం మండలంలోని లఖంపూర్, కుంటాల బాలికల ఆశ్రమపాఠశాలల్లో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినిలకు వైద్యపరీక్షలు చెసి అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. చలి తీవ్రత ఎక్కువ ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో వెచ్చని దుస్తులు వెసుకోవాలని సూచించారు. వేడి నీటితోనే స్నానం చేయాలని, అందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు గుగ్లోత్ అంబారావ్, వార్డెన్ స్వప్న, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్‌ఎంలు, తదితరులు ఉన్నారు



వంట గదిని పరిశీలిస్తున్న డాక్టర్ సద్దాం

పనులు త్వరగా పూర్తిచేయాలి: కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేరడిగొండ, బేల, భీంపూర్, బోథ్, జైనథ్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కిచెన్ షెడ్, ప్రహరీగోడ వంటి మౌలిక సదుపాయాల కల్పన, పనుల పురోగతిపై గురువారం జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా మూడో దశ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో ప్రాథమిక వసతులు సమగ్రంగా అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల విద్యార్థుల సౌకర్యం, భద్రత దృష్ట్యా మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ కనెక్షన్‌లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడలు పూర్తి స్థాయిలో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మాట్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, అధికారులు, ఆయా మండలాల ఎంఈఓలు, కోఆర్డినేటర్‌లు, పాఠశాల ప్రదానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా

బీసీల ఆక్రోశ సభ కరపత్రాల ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న కామారెడ్డిజిల్లాకేంద్రంలో జరగనున్న బీసీల ఆక్రోశ సభకు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ అగ్గిమల్ల గణేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానికంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తూనే ఉన్నాయని, బీసీలు చైతన్యంగా ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. 42శాతం బీసీల రిజర్వేషన్‌ను అమలుచేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 9వ షెడ్యూల్‌లో అంశాన్ని చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ సాధించుకునే వరకు దశలవారీగా ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు సంపంగి వెంకటేష్, అశోక్, సంపత్రి రామచందర్, నవీన్ కుమార్, సాయి కుమార్, రాకేష్, సంతోష్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకులపై దాడులను ఖండిస్తున్నాం'

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకుల భౌతికదాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ జిల్లాకాంగ్రెస్ కమిటీ ఆదివాసీ విభాగం చైర్మన్ సేడ్మకి ఆనందరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోథ్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్, బోథ్ ఆత్మ కమిటీ చైర్మన్‌లకు ప్రొటోకాల్ ఉన్నా స్థానిక ఎమ్మెల్యే ప్రొటోకాల్‌ను పాటించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రొటోకాల్‌పై ఎమ్మెల్యేను నిలదీసినందుకు కాంగ్రెస్ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడడం మంచిది కాదన్నారు. భౌతిక దాడులకు పాల్పడిన ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులకు తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్ రావ్

పోటాపోటీగా జోనల్‌స్థాయి క్రీడలు

- ఓవరాల్ చాంపియన్‌గా బోథ్ డివిజన్ జట్టు



నిర్మల్, బోథ్ డివిజన్‌ల మధ్య జరిగిన కబడ్డీ ఫైనల్‌లో తలపడుతున్న క్రీడాకారులు



బాలికల జట్టుకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే, డీడీలు

ఉట్నూర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్వహించిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల క్రీడాపోటీలు పోటాపోటీగా సాగాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అర్చరీ, పరుగు పందెం, క్యారమ్స్, చెస్ పోటీలు అండర్-17, అండర్-14 విద్యార్థుల మధ్య నిర్వహించిన పోటీలు రసవత్తరంగా జరిగాయి. కబడ్డీ ఫైనల్స్‌లో నిర్మల్, బోథ్ డివిజన్లు తలపడగా బోథ్ విజయం సాధించింది. ఇదే మాదిరిజరిగిన పోటీలలో బోథ్ డివిజన్ ఓవరాల్ చాంపియన్‌గా నిలువగా, ఉట్నూర్ డివిజన్ రెండో స్థానంలో నిలిచింది. గేమ్స్‌లో ఉట్నూర్ డివిజన్ ఓవరాల్ చాంపియన్ షిప్ అందుకోగా ఆదిలాబాద్ డివిజన్ జట్టు ద్వితీయస్థానం అందుకుంది. విజేతలకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ బహుమతులు అందించి అభినందించారు. డిసెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి గిరిజన విద్యార్థుల పోటీలలో కూడా విజేతలుగా రావాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ సూచించారు. క్రీడలతో పాటు చదువుపట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే నృత్యాలు చేస్తూ ప్రోత్సహించారు. కార్యక్రమంలో డీడీ అంబాజి జాదవ్, ఏటీడీఓలు సదానందం, నిహారిక, సుచేతన్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారులు కోరెడ్డి పార్థసారథి, భుక్యరమేష్, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ నాయక్, జీసీడీఓ మేస్రం ఛాయా, పీజీహెచ్ఎంలు గోడం చందన్, జాదవ్‌ఉత్తం, ఆత్రంభాస్కర్, రాథోడ్ ప్రకాష్, ప్రేమ్‌దాస్, మడావి కృష్ణారావు, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం మూడు దశల పోరాటం: టీపీటీఎఫ్

ఉట్నూర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మూడు దశల పోరాటాలను జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు, రాష్ట్ర కౌన్సిలర్ వెడమశ్యామ్‌రావ్‌లు పిలుపునిచ్చారు. మండలంలోని నర్సాపూర్ బీ, లక్కెటిపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గురువారం భోజన విరామ సమయంలో టీపీటీఎఫ్ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలో మొదటిరోజు గిరిజన ఆశ్రమ పాఠశాల లక్కెటిపేట్, నర్సాపూర్ బీ, నార్నూర్ పాఠశాలల్లో కరపత్రాలు విడుదల చేశామన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని విద్యార్థుల, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమైందని అన్నారు. గిరిజన సంక్షేమ వాఖ ఆశ్రమ పాఠశాలల్లో ప్రాథమిక సదుపాయాల లేమి, ఉపాధ్యాయుల ఖాళీలు, విద్యార్థుల వసతి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.